కల్తీకి కళ్లెం విత్తుకు దన్ను

- రైతులకు వరంగా మారిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- నాణ్యత పరీక్షలతో లాభసాటిగా పంటల దిగుబడులు
- వైఎస్సార్ పేరు మార్పు.. కూటమిపై రైతుల ఆగ్రహం

విత్తు బాగుంటే పంట బాగుంటుంది. పంట బాగుంటే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. నాణ్యమైన దిగుబడులు వస్తే ధరలు బాగుంటాయి. ఇవన్నీ బాగుంటే రైతు సుభిక్షంగా ఉంటాడు. ఆ దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. రైతులకు అతి ముఖ్యంగా అవసరమైన విత్తనాలతోపాటు ఎరువులు, పురుగు మందుల నాణ్యతను కాపాడితే రైతు అన్ని రకాల అభివృద్ధి చెందుతాడనే లక్ష్యంతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి అన్నదాతకు అండగా నిలిచింది. ఊర్లోనే రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తోంది. దీంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

-భీమునిపట్నం


వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్


ల్యాబ్‌లో మొలకలు, విత్తనాలను పరీక్షిస్తున్న ఉద్యోగి

భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్, నియోజకవర్గ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. రూ. 73.54 లక్షలతో నిర్మించిన ఈ ల్యాబ్ గత నాలుగేళ్లుగా సేవలు అందిస్తోంది. ఇక్కడ వరి, బెండ, టమోటా, మినుములు, పెసలు, మొక్కజొన్న, వేరుశనగ వంటి వివిధ పంటల విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరిశీలిస్తున్నారు. గతంలో నాణ్యత పరీక్షా సౌకర్యం లేక రైతులు నష్టపోయేవారు. ఇప్పుడు ఈ ల్యాబ్ ద్వారా రైతులు తాము సొంతంగా తయారుచేసినా లేదా కొనుగోలు చేసినా, 40 గ్రాముల నుంచి ఒక కిలో వరకు విత్తనాలను తెచ్చి పరీక్షించుకోవచ్చు. ఇక్కడ ముందుగా ప్యూరిటీ పరీక్ష, ఆ తర్వాత నాణ్యతను నిర్ధారిస్తారు. ముఖ్యంగా మొలకల శాతం 75 నుంచి 98 శాతం వరకు ఉండాలి. లేనిపక్షంలో ఆ విత్తనాలు సాగుకు పనికిరావని తేలుస్తారు. ఒక అఫీషియల్ ఎనలిస్ట్, ఇద్దరు అసిస్టెంట్ ఎనలిస్టుల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ ల్యాబ్ రాకతో నాణ్యమైన విత్తనాలు ఎంచుకునే అవకాశం రైతులకు కలగడంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంది.


ల్యాబ్‌లో ఎరువుల నాణ్యత పరీక్షిస్తున్న దృశ్యం

విత్తనాలు, ఎరువుల పరీక్షల వివరాలు

	విత్తనాలు	ఎరువులు
21-22	38	19
22-23	176	95
23-24	225	158
24-25	201	164


విత్తనాలు, ఎరువులు పరీక్షించే యంత్రాలు

వైఎస్సార్ పేరు తొలగింపు

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పేరును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించింది. రైతులకు ఎనలేని మేలు జరిగిందంటే అది దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వల్లే అన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. అటువంటిది ఈ ల్యాబ్‌కు ఆయన పేరు తొలగించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఎరువుల నాణ్యతకు పరీక్ష

భీమిలిలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో కేవలం విత్తనాలే కాకుండా ఎరువుల నాణ్యతను కూడా పరీక్షిస్తున్నారు. విత్తనాలు నాణ్యమైనవిగా ఉన్నప్పటికీ, ఎరువులు సరైన ప్రమాణాల్లో లేకపోతే పంట దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండ దు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ల్యాబ్‌లో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎరువుల రకాలను బట్టి వాటిలో నత్రజని, పొటాషియం, భాస్వరం శాతాలు 16 నుంచి 60 శాతం వరకు ఉన్నాయో లేదో నిర్ధారిస్తారు. నిర్దేశిత స్థాయిలో పోషకాలు ఉంటేనే వాటి వినియోగానికి అనుమతిస్తారు. విత్తనాలు, ఎరువులు రెండూ నాణ్యత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత రైతులు వాటిని ఉపయోగించవచ్చు. ఇలా పూర్తిగా నాణ్యమైన వాటిని వినియోగించడం వల్ల రైతులు అధిక దిగుబడి సాధించి లాభాలు పొందగలరు. ఈ ల్యాబ్ ద్వారా లభిస్తున్న ప్రయోజనాల దృష్ట్యా, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రైతులు అధిక సంఖ్యలో వచ్చి తమ విత్తనాలు మరియు ఎరువుల నాణ్యతను పరీక్షించుకుంటున్నారు.

నకిలీ విత్తనాలకు చెక్

నకిలీ విత్తనాల వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నారు. ఇందులో భాగంగా, వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని విత్తన విక్రయ కేంద్రాల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు. ఈ నమూనాలను విశాఖలోని రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇదే విధానం అమలవుతోంది. సేకరించిన విత్తన నమూనాలను జంబ్లింగ్ పద్ధతిలో వేర్వేరు టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపుతారు. ఉదాహరణకు, భీమిలి ల్యాబ్‌కు ఇతర జిల్లాల నమూనాలు వస్తాయి, అలాగే భీమిలిలో సేకరించిన నమూనాలు వేరే ప్రాంతంలోని ల్యాబ్‌కు వెళ్తాయి. ఈ విధానం ద్వారా ఫలితాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరోధించవచ్చు. తద్వారా నకిలీ విత్తనాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

భరోసా ఏర్పడింది



గతంలో నకిలీ విత్తనాల వల్ల ఎన్నో పంటల్లో తీవ్ర నష్టం వాటిల్లేది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి కొన్న విత్తనాలు మోసపూరితమైనవని తేలేసరికి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండేవారు. అయితే, భీమిలిలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ఆ సమస్యకు చెక్ పడింది. అంతేకాకుండా, ఎరువుల నాణ్యతను కూడా ఇక్కడ పరీక్షించడం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. ఈ ల్యాబ్ మాకు నిజంగా ఒక వరంలాంటిది.

-చిల్ల వెంకటరమణ, రైతు, చిప్పాడ, భీమిలి మండలం

ధైర్యంగా ఉంది



గతంలో అధిక పెట్టుబడులు పెట్టినా, నాణ్యత లేని విత్తనాలు, ఎరువుల వల్ల ఆశించిన దిగుబడి వచ్చేది కాదు. కానీ ఈ ల్యాబ్ ద్వారా విత్తనాలు, ఎరువుల నాణ్యతను ముందే తెలుసుకోవడం వల్ల, ధైర్యంగా పంటలు సాగు చేయడానికి అవకాశం లభించింది. ఇప్పుడు నమ్మకంతో వ్యవసాయం చేయగలుగుతున్నాం.

-ఎస్.నారాయణరావు, కృష్ణాపురం, పద్మనాభం మండలం

కచ్చితమైన ఫలితాలతో లాభం



ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలను అత్యంత శ్రద్ధగా, జాగ్రత్తగా నిర్వహిస్తాం. క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాత ఫలితాల వివరాలను రైతులకు అందించి, మంచి దిగుబడులు సాధించేందుకు అవసరమైన సూచనలు కూడా ఇస్తాం. మా ప్రయత్నం రైతులు లాభపడేలా చేయడమే.

-పి.శ్రీకాంత్, అఫీషియల్ ఎనలిస్ట్

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు రావణ లంకాదహనం


రూపుదిద్దుకుంటున్న భారీ సెట్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులోని మంగమారిపేట గ్రామ దేవత శ్రీ ఎర్నిమాంబ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రావణ లంకా దహనం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గరికిన కింగ్ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ముందుగా వివిధ కళాకారులతో స్టేజ్ ప్రోగ్రామ్స్ , బాణసంచా కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

188 మందికి కంటి పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎస్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో మంగళవారం భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద గల సన్‌స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 188 మంది రోగులు పాల్గొన్నారని తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి చెందిన డాక్టర్లు ఆర్.కృష్ణవేణి, బి.వివేక్ వర్మ రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 45 మంది ఆపరేషన్ల కోసం ఎంపికయ్యారని, వారిని విశాఖకు తరలించి ఆపరేషన్లు చేయిస్తామని ఆయన వెల్లడించారు. కళ్లద్దాలు అవసరమైన వారికి త్వరలో ఉచితంగా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ ఎస్.ఎల్.రావు, ముసునూరి సూర్య శ్రీనివాస్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, అడిదం కిశోర్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ట్యాంకు శుభ్రం చేసి ఎన్నాళ్లయిందో..!


ఎస్సీ కాలనీలో శిథిలమైన రక్షిత మంచినీటి పథకం

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీలోని ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం దీనావస్థకు చేరింది. కాలనీలోని మంచినీటి ట్యాంకుకు వెళ్లే మెట్లు పూర్తిగా శిథిలమైపోయాయి. ట్యాంకు పై వరకు మెట్లు విరిగిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. అంతేకాకుండా, మెట్ల మార్గంలో ఏర్పాటు చేసిన రెయిలింగ్ కూడా ఎక్కడికక్కడ ఊడిపోయింది. దీంతో ఏళ్ల తరబడి ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమై, అపరిశుభ్రంగా మారింది. సమస్య గురించి కాలనీ వాసులు గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


డివైడర్ దాటకుండా ముళ్ల కంచెలు పెట్టిన దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలోని ఆర్టీవో కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు చేసిన ప్రయత్నాలు విపరీత పరిణామాలకు దారి తీస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు డివైడర్‌ను దాటకుండా నిరోధించడానికి పోలీసులు డివైడర్‌పై గోతులు తీసి ముళ్ల కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు సిమెంట్ దిమ్మెలను అడ్డుగా ఉంచారు. అయితే, ఈ నిరోధక చర్యలకు ద్విచక్రవాహనదారులు మరో ఉపాయాన్ని కనుగొన్నారు. వారు డివైడర్‌ను దాటడానికి ముళ్ల కంచెలు, సిమెంట్ దిమ్మెలు లేని పక్కనే రాళ్లను ఏర్పాటు చేసుకుని వాటి సహాయంతో అవతలి వైపుకు వెళ్తున్నారు. పోలీసులు ప్రమాదాలను తగ్గించడానికి చేసిన ఈ ఏర్పాటు ఇప్పుడు మరింత ప్రమాదకరంగా మారుతోంది. రాళ్లపై నుంచి వాహనాలను నడపడం ఒక్కోసారి అదుపు తప్పి ప్రాణాలు తీసే ప్రమాదానికి దారితీస్తోంది. ప్రయాణికుల భద్రత కోసం పోలీసులు తీసుకున్న చర్యలు సరైనవే అయినప్పటికీ, వాటి అమలులో లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

కూటమి పాలన అవినీతిమయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి హరికిరణ్‌రెడ్డి



తగరపువలస: కూటమి పాలన లంచాలు, స్కాంలమయంగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలన పారదర్శకంగా ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియాతో పాటు రాజధాని నిర్మాణంలో అవినీతి పెరిగిందని విమర్శించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటున్నారని, యాక్సిస్ సంస్థతో చేసుకున్న ఒప్పందం వల్ల యూనిట్‌కు రూ.2.10 పైసలు అదనంగా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ సెకీతో తక్కువ ధరకే ఒప్పందం చేసుకుని ప్రజాధనాన్ని ఆదా చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధిక ధరలకు కొనుగోలు చేస్తూ స్కాంకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మోసం చేస్తున్నారని హరికిరణ్‌రెడ్డి దుయ్యబట్టారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని మరోమారు రుజువైందన్నారు.

చేపల మార్కెట్ శుభ్రం


ప్రయివేట్ మార్కెట్‌లో చేపల విక్రయాల చోట శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది


చేపల మార్కెట్‌లో బ్లీచింగ్, ఫినాయిల్‌తో శుభ్రం చేసిన పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ప్రైవేట్ మార్కెట్‌లోని చేపల మార్కెట్‌ను యాజమాన్యం ఎట్టకేలకు శుభ్రం చేయించింది. 'ఇక్కడ కొంటే ఆరోగ్యం 'ఫి'ని'ష్'' శీర్షికతో సాక్షిలో మంగళవారం వచ్చిన కథనానికి స్పందించిన యాజమాన్యం, పారిశుధ్య సిబ్బందితో మార్కెట్‌ను పూర్తిగా ఊడ్చి, ఫినాయిల్‌, బ్లీచింగ్ చల్లించింది. కలుషిత వాతావరణంలో చేపల విక్రయంపై వినియోగదారుల ఆందోళన నేపథ్యంలో జీవీఎంసీ శానిటేషన్ విభాగం కూడా స్పందించింది. ఒక్కరోజులోనే మార్కెట్‌లో వచ్చిన మార్పును చూసి వినియోగదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష పూజలు


విశేష అలంకరణలో పంచముఖ ఆంజనేయ స్వామి

మధురవాడ: జాతర గట్టులోని చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ క్షేత్ర పాలకుడైన పంచముఖ ఆంజనేయ స్వామికి వైశాఖ శుక్ల నవమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యపూజలతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం పంచామృత, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం చేశారు. తులసి మాలలు, వడలు, తమలపాకులు, పూలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. అర్చకులు పట్నాల మూర్తి శర్మ, హరి స్వామిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా చంద్రంపాలెంకు చెందిన పిళ్లా సన్యాసిరావు, అరుణకుమారి దంపతులు సహకారంతో ఆలయ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పోతిన పైడిరాజు, పిళ్లా రమ, పొట్నూరి హరికృష్ణ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.


క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతగా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవన కార్యాలయాల సిబ్బంది మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నియాన్ గ్రీన్ కలర్స్ జట్టు విజయం సాధించింది. బ్లూ బ్లాస్టర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ విజేతలకు, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. గ్రీన్ థండర్స్ మేనేజర్ డా.పి.వి.ఎస్.ఎన్.వి.సాంబమూర్తి, కెప్టెన్ పి.రాజేంద్ర ప్రసాద్, బ్లూ బ్లాస్టర్స్ మేనేజర్ ఆర్. శ్రీనివాస్, కెప్టెన్ కె.సంతోష్ కుమార్ , ఇతర క్రీడాకారులను అధికారులు అభినందించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు


సంపంగి, తులసి మాలల అలంకరణలో రాస పోలమాంబ


కొబ్బరి ఆకులు, బోండాల అలంకరణలో తోగాలమ్మ


తాటికాయల అలంకరణలో గుడివాడ ముత్యాలమ్మ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారు 105వ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోరాడ రమణ, రామయ్యమ్మ, వన్షితశ్రీ ఆర్థిక సహకారంతో ఆలయ కమిటీ సంపంగి పువ్వులు, తులసిమాలలతో అమ్మవారిని సుందరంగా అలంకరించింది. తుపాకుల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మరోవైపు చిప్పాడ దివీస్ లేబరేటరీ రహదారిలోని మద్దిపేట వద్ద గల గుడివాడ గ్రామదేవత తోగాలమ్మను ఆలయ కమిటీ ప్రతినిధులు కొబ్బరి బోండాలు, ఆకులతో అలంకరించారు. అదే ఆవరణలో ఉన్న ముత్యాలమ్మను తాటికాయలు, ఆకులతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అస్తవ్యస్త పార్కింగ్‌తో తరచూ ట్రాఫిక్ సమస్యలు


మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు


మధురవాడ సర్వీసు రోడ్డులో నిలిపోయిన ట్రాఫిక్

మధురవాడ: హైవే సర్వీసు రోడ్డులో వాహనాల అస్తవ్యస్త పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు మళ్లీ తీవ్రమయ్యాయి. మధురవాడ జోనల్ కార్యాలయం, అప్ బ్రిడ్జి, డైలీ మార్కెట్, కొమ్మాది జంక్షన్ వంటి ప్రాంతాల్లో కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలు నిలపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా సోమ, మంగళవారాల్లో జీవీఎంసీకి వచ్చే సందర్శకులు తమ కార్లను సర్వీసు రోడ్డుపైనే నిలిపివేయడంతో పరిస్థితి మరింత దిగజారుతోంది. దీనికి తోడు ఆటోలు ఎక్కడ పడితే అక్కడ ఆగడం సమస్యను జటిలం చేస్తోంది. జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌లపై ద్విచక్రవాహనాలు, పక్కనే కార్లు పార్కింగ్ చేయడం పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. ఈ అస్తవ్యస్త పార్కింగ్ కారణంగా తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఫుట్‌పాత్ మీదనే పార్కింగ్ చేసిన జీవీఎంసీ అధికారి వాహనం

అనంతుని గిరిపై విశేష పూజలు


గిరిపైన యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేద మండితులు


గిరిపైన యాగ శాలలో ఉభయ దేవీరులు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: పద్మనాభంలోని అనంతుని గిరిపై జరుగుతున్న శిఖర ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం యాగశాలలో వేద పండితులు శాస్త్రోక్తంగా వాస్తు పూజ, హోమం, నవగ్రహారాధన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం జరిగిన పూజా కార్యక్రమాల్లో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నిత్యం వెలిగే అఖండ జ్యోతి అయిన అజస్ర దీపారాధన, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్ఠాపన వంటి ముఖ్యమైన పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. యాగశాలలో కొలువుదీరిన ఉభయ దేవీ సమేతుడైన శ్రీదేవి, భూదేవిలతో కూడిన అనంత పద్మనాభ స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తి భావంతో నిండిపోయింది.

రక్షణలేని పాతకాలం నాటి వంతెన, చెక్‌డ్యామ్


కేథరిన్ పబ్లిక్ స్కూల్ దాటిన తరువాత కొత్త మూలకుద్దుకు వెళ్లే దారిలో చెక్‌డ్యామ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని రెండో వార్డు చిల్లపేట నుంచి కేథరిన్ విద్యాసంస్థల మీదుగా భీమిలి మండలం కొత్త మూలకుద్దుకు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న చెక్‌డ్యామ్, వంతెన ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలోనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా ఈ మార్గంలో వీటిని దాటుకుని వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఈ మార్గంలో గెడ్డలు, ఉప్పుటేరును దాటడానికి ఎప్పుడో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్, వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ పిల్లర్లు పూర్తిగా శిథిలమై రాలిపోయాయి. గోస్తనీ నదికి వరదలు వచ్చిన సమయంలో కొత్త మూలకుద్దు నీట మునిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ సమయంలో స్థానికులు పడవలపై రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఇటీవల ఈ మార్గంలో బీటీ రోడ్డును ఆధునీకరించినప్పుడు ఈ చెక్‌డ్యామ్, వంతెనను కూడా బాగు చేస్తారని గ్రామస్తులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. అయితే కాంట్రాక్టర్ వీటిని పట్టించుకోకుండానే మిగిలిన రహదారి పనులు పూర్తి చేయడం విమర్శలకు దారితీసింది. ఇరుకైన ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పక్కనే ఉన్న గెడ్డలోకి వాహనాలు దూసుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణం మరింత భయానకంగా ఉంటుంది. వాస్తవానికి ఈ చెక్‌డ్యామ్, వంతెనను ఆధునీకరించడంతో పాటు వాటిని వెడల్పు చేసి, ఇరువైపులా బలమైన రక్షణ పిల్లర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కొండలను కొల్లగొడుతున్నారు


జగ్గురాజుపాలెంలో తరలించిన కొండ గ్రావెల్

తగరపువలస: ఆనందపురం మండలంలో శని, ఆదివారాలు వస్తే చాలు కొండల అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రైవేట్ లే అవుట్ల యజమానులు రాత్రి వేళల్లో యంత్రాలు, లారీలతో చందక, తర్లువాడ, శొంఠ్యాం, పందలపాక, మామిడిలోవ, ఆనందపురం, కుసులవాడ, లొడగలవానిపాలెం, గంభీరం పంచాయతీల్లోని కొండలను యథేచ్ఛగా తవ్వుకుపోతున్నారు. స్థానిక కూటమి నాయకుల అండదండలతో రూ. లక్షల విలువైన గ్రావెల్‌ను తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారాంతాల్లో తవ్వకాలు జరుగుతున్న సమయంలో ఫోన్ చేసినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల గ్రామాల్లో పచ్చదనం కనుమరుగవుతోందని, ప్రభుత్వ స్థలాలు, కొండలు ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండలను, ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులే అక్రమార్కులకు సహకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ స్పందించి అక్రమంగా గ్రావెల్, కొండరాళ్లు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.